www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 22 మే 2025 5 కాకినాడ

## ఆక్రమణల తొలగింపు వాయిదా

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు కార్యక్రమం వాయిదా పడినట్టు తహశీల్దార్ పి.త్రినాథరావు తెలిపారు. మండల పరిధిలో చొల్లంగి నుంచి సుంకరపాలెం వరకూ గల జాతీయ రహదారి 216 రోడ్డుకు ఇరువైపులా గల ఆక్రమణలను ఈ నెల 21న నేషనల్ హైవే అధారిటీ తొలగించనున్నట్టు ఇప్పటికే సమాచారం మేరకు, వర్షాల కారణంగా తొలగింపు కార్యక్రమం వాయిదా పడినట్టు ఆయన తెలిపారు. హైవే రోడ్డుకు ఇరువైపులా గల ఆక్రమణదారులు ఈలోపులో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. అలా తొలగించని ఎడల నేషనల్ హైవే అధికారులు పోలీసుల సహకారంతో త్వరలోనే ఆక్రమణలు తొలగిస్తారని, దానికి సహకరించాలని కోరారు.

# నిబంధనలు పట్టని విద్యా సంస్థలు

▸ అనుమతులు లేకుండానే హాస్టళ్ల నిర్వహణ
▸ పట్టించుకోని విద్యాశాఖ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ర్యాంకుల పంట, అగ్రగామిగా మా సంస్థే ఉంది. అత్యధిక మార్కులు మా విద్యార్థులకే సొంతం అంటూ ఆకర్షణీయమైన ప్రకటనలతో పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రులకు గాలం వేస్తున్నాయి. కానీ అనేక కళాశాలల్లో కనీస సౌకర్యాలు మాత్రం కనిపించడం లేదు. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సుమారు 200 ప్రైవేటు జూనియర్ కళాశాలలుండగా దాదాపు 50 వేలు మంది విద్యార్థులు చదువుతున్నారు.

**కానరాని సౌకర్యాలు**

ఉమ్మడి జిల్లాలో పలు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పలు విద్యాసంస్థలు ఇరుకు గదుల్లోనే తరగతులను నిర్వహిస్తున్నారు. రూ.వేల్లో ఫీజులు, ట్యూషన్ ఫీజు, పుస్తకాలు ఫీజు, బెల్ట్ ఫీజు అంటూ అనేక రకాల పేర్లు చెప్పి తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారు. కానీ విద్యా సంస్థల్లో ఉండాల్సిన కనీస సౌకర్యాలు మాత్రం కనిపించడం లేదు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం తరగతి గదులు విశాలంగా ఉండాలి. గదుల్లో వెలుతురు, ఫ్యాన్లు, బెంచీలు ఉండాలి. కానీ అనేక సంస్థల్లో వాటిచాలని గదుల్లో ఒకే బెంచ్ లో ఐదుగురిని కూర్చోబెట్టి బోధన సాగిస్తున్నారు. రక్షిత మంచినీరు, సరిపడ మరుగుదొడ్లు అందుబాటులో ఉండడం లేదు. కనీసం ఆడుకోవడానికి ఆట స్థలం లేని కాలేజీలు కాకినాడ జిల్లా కేంద్రంలో అనేకం ఉన్నాయి. సెక్షన్‌కు 80 మంది విద్యార్థులు, కోటా ప్రకారం సీట్ల కేటాయింపు బిల్డింగ్ పర్మిషన్, లీజ్ అగ్రిమెంట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, పార్కింగ్ స్థలం, ఫర్నిచర్, కంప్యూటర్ గది, సిబ్బంది ఒరిజినల్ సర్టిఫికెట్లు, నాణ్యమైన బోధనను అందించే అధ్యాపకులు లేని కళాశాలలు జిల్లాలో అనేకం ఉన్నాయి. ప్రభుత్వం జూనియర్ కళాశాలలకు అనుమతి ఇచ్చేటప్పుడు ఇవన్నీ చూసి ఇవ్వాలి. కానీ విద్యాశాఖ అధికారులు కనీసం ఇవేమీ పట్టించుకోకుండా అనుమతి ఇస్తున్నారు. అసౌకర్యాల నడుమ విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు. ప్రభుత్వ అధికారుల అజమాయిషీ లేకపోవడం వల్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

**అనుమతులు లేకుండానే**

కాకినాడ, రాజమండ్రి వంటి ప్రాంతాల్లో కొన్ని కళాశాలలు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. నారాయణ, శ్రీ చైతన్య వంటి కార్పొరేట్ కళాశాలలు బ్రాంచిల పేరుతో ఒకటి రెండు కళాశాలలకు అనుమతులు తీసుకుని, 4, 5 కళాశాలల ద్వారా అడ్మిషన్లు చేసి తరగతులను నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇటువంటి కళాశాలలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కళాశాలలకు గుర్తింపులేని కారణంగా విద్యార్థులు నష్టపోయే అవకాశాలున్నాయి. ఫలితంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు సక్రమంగా అందే అవకాశం ఉండదు.

**అనుమతులు లేని హాస్టళ్లు**

కాకినాడ జిల్లాలో దాదాపు అన్ని ప్రైవేటు కళాశాలలు అనుమతులు లేకుండానే హాస్టళ్లను నిర్వహిస్తున్నాయి. ఇంటర్మీడియట్ విద్యా సంస్థల్లో హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేయాలంటే ఇంటర్మీడియట్ అధికారుల నుంచి పర్మిషన్ తీసుకుని హాస్టల్లో కళాశాలలో నిర్వహించాలి. కానీ కాకినాడ నగరంలో కొన్ని విద్యా సంస్థలు ఎటువంటి పర్మిషన్లు తీసుకోకుండానే కళాశాలల్లో హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. నిర్వహించడమే కాక రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. హాస్టల్ పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇంటర్మీడియట్ అధికారులు కనీసం పట్టించుకోకపోవడం వల్ల ఇటువంటివి కళాశాలలో విద్యార్థులు తల్లిదండ్రుల నుండి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో హాస్టల్ విద్యార్థులే ఉంటున్నారు. హాస్టల్లో ఉండే విద్యార్థులను యాజమాన్యాలు వేకువ జామున లేకుండా రాత్రి 11 గంటల వరకు ఉదయం 4 గంటలకే విద్యార్థులు చదువు పేరు చెప్పి మానసికంగా హింసించే పరిస్థితి ఉంది. గతంలో కాకినాడలో శ్రీ చైతన్య, భాష్యం వంటి విద్యా సంస్థల హాస్టళ్లలో విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. కావున ఇప్పటికైనా పర్మిషన్ లేని హాస్టళ్లు తక్షణమే మూసివేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది.

## అన్నదాత సుఖీభవపై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి-కాకినాడ

అన్నదాత సుఖీభవ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, విధివిధానాలు ప్రకటించాలని ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రకటనలో డిమాండ్ చేసింది. గురువారం కాకినాడలో నిర్వహించే తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులో కౌలు రైతుల సమస్యలు చర్చించి ప్రభుత్వం నుండి స్పష్టత తీసుకు రావాలని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు కోరారు. మంగళవారం మంత్రివర్గ సమావేశంలో అన్నదాత సుఖీభవపై స్పష్టమైన ప్రకటన రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తేనే అన్నదాత సుఖీభవ ఇస్తామన్నట్టు కొన్ని పత్రికల్లో వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి మూడు విడతలుగా రూ.60,00 భూమి కలిగిన రైతులకు జమ చేస్తుందన్నారు. కౌలు రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆ పథకాన్ని వర్తింప చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కౌలు చట్టం మారుస్తామని, అన్నదాత సుఖీభవ కౌలు రైతులందరికీ ఇస్తామని శాసనసభలో, మండలిలో వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారు కానీ, వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా అన్నదాత సుఖీభవ విధివిధానాలు ప్రకటించకపోవడంపై అనేక అనుమానాలు వస్తున్నాయన్నారు. కాబట్టి అన్నదాత సుఖీభవ కౌలు రైతులందరికీ ఇస్తారా లేదా గత ప్రభుత్వం లాగా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఇచ్చి ఒసిలకు ఎగ్గొడతారా అనేది స్పష్టం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి గుర్తించిన ప్రతి కౌలు రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వాలన్నారు.

## మహిళలకు బ్యూటీ థెరపిస్టు శిక్షణ

ప్రజాశక్తి పిఠాపురం

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు కోర్స్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పిఠాపురం స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రేవతి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలు పాటు సదరు కోర్సు కు 18 నుండి 35 ఏళ్ల వయస్సు గల మహిళలకు శిక్షణ ఉచితంగా అందజేస్తామని 8639951441లో సంప్రదించాలని కోరారు.

## 15వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

సమ్మె శిబిరంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు, కోణాల వెంకటరమణ, బొమ్మన రవికుమార్, తూతిక సాయి, నాళం శివకుమార్, మహాపాతిన పాపారావు, అరుణ్, ఎస్‌కె.బషీర్, సుంకర సత్తిరాజు, బాసిన భద్రరావు, నాగేశ్వరరావు, జి.సతీష్, భాస్కర్, పూల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కథా రచనపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పెద్దాపురం

విద్యార్థి దశ నుండి కథారచనపై అవగాహన పెంచాలని సాహితీ స్రవంతి కమిటీ సభ్యురాలు, ప్రముఖ కవయిత్రి చిరిగిన మంజుల అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో బుధవారం ఆమె విద్యార్థులకు కథా రచనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు తమ చుట్టూ జరుగుతున్న సంఘటనలు, వాటిలో ప్రధానమైన అంశాలు అవగతం చేసుకోవడం ద్వారా విద్యార్థులు కథా రచనగా మలచవచ్చున్నారు. మనం తెలుసుకున్న అంశాన్ని ఇతరులకు చెప్పటంలో కథా రచన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అమ్మమ్మ చెప్పిన కథలు విద్యార్థులు ఇతరులకు చెప్పడం ద్వారా కథారచన అలవాటు చేసుకోవాలన్నారు. కథలు చెప్పడంపై ఆసక్తి పెంచుకుంటే కథారచన సులువవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆమె అనేక నీతి కథలు చెప్పి వాటి సారాంశాన్ని వివరించి అవే కథలు విద్యార్థులతో చెప్పించారు. కరాటేలో తెప్పల యోగేష్, యోగాలో లోకేష్, సైన్స్ ప్రయోగాలపై బుద్దా శ్రీనివాస్, సాము గరిడీలో నీలపాల కృష్ణ శిక్షణ ఇచ్చారు. పిసిసి కార్యదర్శి రొంగల అరుణ్ కుమార్, అమృత, నమ్రత, రవికుమార్, జశ్విత, అంజలి, లావణ్య, లలిత, పవన్ కుమార్, బాషా, సందీప్, హర్ష, బంగారం పాల్గొన్నారు.

కథా రచనపై అవగాహన కల్పిస్తున్న మంజుల

ట్యాంకర్ నీరు పట్టుకుంటున్న కాలనీవాసులు

### తాగునీటి కోసం ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక గౌరీ కోనేరు కాలనీలోని మంచినీటి బోరు బుధవారం తెల్లవారుజాము నుండి పనిచేయకపోవడంతో ఈ బోరుపై ఆధారపడిన గౌరీ కోనేరు కాలనీ, అంకయ్య పేట, సుబ్బయ్య పేట, వీరయ్యమ్మ పేట తదితర ప్రాంతాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆ వార్డు కౌన్సిలర్ కట్టా రాజబాబు ఈ విషయాన్ని మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే వారు స్పందించి వెంటనే ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు మంచినీటి ఎద్దడి ఏర్పడిన ప్రాంతాలలో బుధవారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసినట్లు కౌన్సిలర్ రాజబాబు తెలిపారు. ఈ బోరు రిపేరు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

వర్షపు నీటిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

### కనీస వసతులు కల్పించాలని గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - తాళ్లరేవు

నీలపల్లిలోని జగనన్న కాలనీలో కనీస వసతులు కల్పించాలని గ్రామస్తులు బుధవారం ఆందోళన చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జగనన్న కాలనీలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు గంధం వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తాగేందుకు మంచి నీళ్లు లేవని, కాలనీలో నడిచేందుకు దారి లేదని వారు వాపోయారు. అనంతరం స్థానిక సర్పంచ్ చిట్టూరి నాగమణికి సమస్యను వివరించారు. స్పందించిన ఆమె అధికారులను కాలనీకి పంపించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్మికులతో మాట్లాడుతున్న రంగనాగ్

### హమాలీల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- సామర్లకోట

ఐఎంఎల్ డిపోలో హమాలీ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు హామీ ఇచ్చారు. జి.రాగంపేట రోడ్డులో ఐఎంఎల్ బేవరేజెస్ డిపో వద్ద ఉన్న శ్రీసత్తమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం వారు శంకుస్థాపన చేశారు. ఐఎంఎల్ డిపో యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రంగనాగ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు, భీమేశ్వరాయల ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, ఐఎంఎల్ డిపో మేనేజర్ కాటూరి రామకష్ణ, ఎఎం సిహెచ్.రమణబాబు, ఎస్ఐ కన్నూరి త్రిమూర్తులు, ఎక్సైజ్ సిఐ కె.శ్రీనివాసు, సంఘ అధ్యక్షులు విశ్వనాథుల అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి అమలకంటి సోమేశ్, నాయకులు విప్పర్తి కొండలరావు, బైరెడ్డి సత్యనారాయణ, కూండ్రపు దుర్గాప్రసాద్, ఉండవల్లి సతీష్, బిక్కిన శ్రీనివాస్, సిరికి శ్రీను, పప్పుల సత్తిబాబు, మిడతాడ శ్రీను, నందిపాటి వీరబాబు, వెన్నెల గోవిందు, నక్కా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'




## అక్రమ కేసులకు భయపడేది లేదు

ప్రజాశక్తి-తుని

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాజా

అక్రమ కేసులకు భయపడేది లేదని మాజీ మంత్రి వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. బుధవారం ఎస్.అన్నవరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తునిలో మంగళవారం నాడు జరిగిన మినీ మహానాడు కార్యక్రమంలో యనమల రామకష్ణుడు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వాడు, వీడు అని సంబోధించడాన్ని రాజా తీవ్రంగా ఖండించారు. లిక్కర్ స్కామ్‌లో రూ.3700 కోట్ల ముడుపులు అందాయని యనమల ప్రచారం చేయడాన్ని ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి జైల్లో పెట్టారన్నారు. తుని నియోజకవర్గాన్ని 170 కోట్లతో అభివృద్ధి పరిచామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఐదేళ్ల వైఎస్.జగన్ పాలనలో చేసిన అభివద్ధి పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ప్రారంభించి కూటమి ప్రభుత్వం చేసినట్లుగా విస్తత ప్రసారం చేసుకోవడాన్ని ఖండించారు. గత 45 ఏళ్లుగా యనమల రామకష్ణుడు అధికారంలో ఉన్నప్పటికీ తన స్వగ్రామమైన ఎవి.నగరంలో కనీస మౌలిక వసతులు కల్పించలేదని, ఇక తుని నియోజకవర్గాన్ని 11 నెలల కాలంలో రూ.170 కోట్లతో అభివద్ధి ఎలా చేశారో వివరించాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఎవి.నగరంలో నాడు-నేడు ద్వారా జిల్లా పరిషత్ హైస్కూల్‌ను రూ.కోట్లాది ఖర్చుతో నిర్మించినా ఆ భవనాన్ని ఇప్పటివరకు ప్రారంభించలేదని విమర్శించారు.

## ప్రశాంతంగా ఎపిఇఎపిసెట్ పరీక్షలు

ప్రజాశక్తి-గండేపల్లి

పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఎపిఇఎపి సెట్-2025 ఆన్‌లైన్ ఎగ్జామ్స్ మూడో రోజు ప్రశాంతంగా నిర్వహించినట్టు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెండో రోజు ఉదయం ఆదిత్య యూనివర్సిటీలో 237 మందికిగాను 228 మంది హాజరు కాగా 9 మంది హాజరు కాలేదు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 295 మందికిగాను 281 మంది హాజరు కాగా 14 మంది హాజరు కాలేదు. సాయంత్రం ఆదిత్య యూనివర్సిటీలో 239 గాను 231 హాజరు కాగా 08 మంది హాజరు కాలేదు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 294 గాను 288 హాజరు కాగా 6 మంది హాజరు కాలేదు.

## కెవి.చిన్నయపాలెంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-కోటనందూరు

ఎంఎల్ఎ యనమల దివ్యకు అర్జీలు అందిస్తున్న ప్రజలు

ప్రజా సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి సహకరించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, తుని ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. బుధవారం కెవి.చిన్నయపాలెంలో టిడిపి మండల అధ్యక్షుడు గాడి రాజబాబు, తుని మార్కెట్ యార్డ్ చైర్మన్ అంకమ్మరెడ్డి రమేష్ అధ్యక్షతన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పని చేయాలని క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. భూ సరిహద్దు వివాదాలు, పెన్షన్లు, ఇళ్ల స్థలాల కోసం, మొత్తం 12 ఫిర్యాదులను అందయని ఎంపిడిఒ పి.వెంకటనారాయణ, తహశీల్దారు టి.సుభాష్ తెలిపారు. కుండపోత వర్షం కురిసినప్పటికీ వర్షాన్ని లెక్క చేయకుండా ప్రజలు ప్రజా దర్బార్లో పాల్గొనే తమ సమస్యలను ఎంఎల్ఎకు ఫిర్యాదు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు యనమల రాజేష్, పెంటకోట భాస్కర్, గొర్లి అచ్చియ్యనాయుడు, దంతులూరి చిరంజీవి రాజు, వెలగా వెంకట కృష్ణారావు, పెనుమచ్చ నాగేశ్వరరావు, పోతల సూరిబాబు, ఎర్రా చినసత్యనారాయణ, షేక్ జానీ, అంకంరెడ్డి బుల్లిబాబు, రుత్తల సత్యసీతయ్య, చిటికెల సత్యనారాయణ, బోడపాటి సత్యనారాయణ, బైలపూడి శ్రీరామ్మూర్తి, కొండయ్య, బాపిరాజు, గాది రాము తదితరులు పాల్గొన్నారు.

### జిఒ 4ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు

వినతిపత్రం అందిస్తున్న విఆర్ఒలు

గ్రామ రెవెన్యూ అధికారులకు ప్రతిబంధకంగా మారిన జిఒ నెంబర్ ఫోర్‌ను రద్దు చేయాలని మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు ఈశ్వర సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన కాజులూరు తహశీల్దారు కార్యాలయంలో జిఒ నెంబర్ 4 గ్రామ రెవెన్యూ అధికారులకు ప్రతిబంధకంగా ఉందని నిరసిస్తూ వినతిపత్రాన్ని తహశీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్‌కు అందించారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సంఘం అధ్యక్షుడు ఈశ్వర సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ సంఘం పిలుపుమేరకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిఒ 4 ప్రకారం రెండు సచివాలయాలను ఒక్క క్లస్టర్‌గా మార్చడం వల్ల ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులలో సగం మంది తగ్గిపోతున్నారని, ఇప్పటికే సచివాలయంలో వచ్చే అప్లికేషన్‌లలో 95 శాతం గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా మాత్రమే పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ఇలా రెండు సచివాలయాలకు ఒక రెవెన్యూ అధికారుని నియమించడం వల్ల అధిక పనిభారం పడుతుందని, దీంతో మానసికంగా శారీరకంగా అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ప్రతి సచివాలయం నకు గ్రామ రెవెన్యూ అధికారులని ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు సూర్యనారాయణమూర్తి, విష్ణువు రాధాకృష్ణ, సత్యనారాయణ, శ్రావణి కుమారి, ఆదినారాయణ పాల్గొన్నారు.

### ఆదిత్య అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించినట్లు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. రాష్ట్రంలోని 34 డిగ్రీ, పీజీ కళాశాలల నుండి అధ్యాపకులు పాల్గొన్నారు. సబ్జెక్టుల వారీగా రెండు విడతలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలివిడతలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టాటిస్టిక్స్ అధ్యాపకులకు ఏడు రోజులు పాటు ఎఫ్‌డిపి నిర్వహించారు. తొలి విడత ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ నాయుడు మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర విద్యార్థులు అన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణమైన జ్ఞానాన్ని ఒడిసి పట్టుకున్నప్పుడే అధ్యాపకులు మరింత పటిష్టంగా తయారవుతారని, అలాంటి అధ్యాపకుల బోధన నేడు చాలా అవసరమని చెప్పారు. కంపెనీ ఆధారిత శిక్షణ ద్వారా సాధారణ విద్యార్థిని కూడా ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దగలరని అన్నారు. కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి మాట్లాడుతూ బోధనలో సాంకేతికతను జోడించినప్పుడే విద్యార్థికి ఆ పాఠం ఉపయోగపడుతుందని అన్నారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమంలో డిగ్రీ సిలబస్‌తో పాటు, ప్రపంచ జ్ఞానానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని నిపుణులచే ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ చేసామని అన్నారు. ఈ ప్రోగ్రాంలో పాల్గొన్న అధ్యాపకులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అభినందించారు.

### ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి భాను ప్రకాష్

మండల పరిధిలో ఎక్కువమందికి ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి హామీ పథకం ఎపిడి ఎం.భాను ప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఎంపిడిఒ డి.శ్రీలలిత అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన గ్రామాల వారీగా ఉపాధి పనులు, పనుల్లో పాల్గొంటున్న ఉపాధి కూలీల మస్టరు, ఫారం ఫాండ్స్, గోకులాలు, పశువుల నీటి తొట్లు, కంపోస్టు పిట్ల నిర్మాణాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఒక్కొక్క గ్రామంలో కనీసం 100 కంపోస్టు పిట్లు నిర్మించాలన్నారు. ఉపాధి కూలీల ఇంటి వద్ద నిర్మించే ఈ పిట్లకు సంబంధించి ఉపాధి కూలీకి రెండు పని దినాల మస్టర్లు వేయాలన్నారు. ఎంపిడిఒ శ్రీలలిత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ యు.సుధీర్, జెవి వి.సతీష్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

వివరాలను వెల్లడిస్తున్న సిఐ దొర రాజు

### నకిలీ నోట్ల కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

నకిలీ నోట్ల చెలామణి చేస్తున్న కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అంగర పోలీస్ స్టేషన్‌లో నిందితులను బుధవారం మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మండపేట రూరల్ సిఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్ మీడియాకు వెల్లడించారు. మంగళవారం అంగర రైస్ మిల్ ఎదురుగా వున్న బడ్డీ కొట్టులో రాజమహేంద్రవరానికి చెందిన మన్యం వీరవెంకటసత్యసీతారామారావు రూ.500 నోట్ ఇచ్చి సిగరెట్ పెట్టి కొనుగోలు చేశాడు. అతను ఇచ్చిన నోటు నకిలీదిగా షాపు యజమాని కశెట్టి సత్యనారాయణ గుర్తించాడు. స్థానికులు సహాయంతో నిందితుడు సీతారామారావును పట్టుకొని అంగర పోలీసులకు అప్పగించారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో విజయవాడలోని మరో నిందితుడు వారా నవీన్‌ను పట్టుకున్నారు. అతని నుంచి 44 నకిలీ రూ.500 నోట్లను, ల్యాప్‌టాప్, కలర్ ప్రింటర్, 17 ఎగ్జిక్యూటివ్ బాండ్ పేపర్లు, పెన్ డ్రైవ్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను కోర్టుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

### కారు ఢీకొని మహిళ దుర్మరణం

ప్రజాశక్తి - రాజానగరం

కంటి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వెళున్న ఒక మహిళను కారు ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన రాజానగరంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కలవచర్ల గ్రామానికి చెందిన యర్రా మాణిక్యం నేత్ర వైద్య పరీక్షల కోసం బుధవారం జిఎస్ఎల్ ఆసుపత్రికి వెళ్లింది. అక్కడ ఆసుపత్రి ఎదురుగా రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మాణిక్యం(54) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. దీనిపై ఎస్ఐ నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలో అవిడి రేవు సమీపంలోని పంట కాలువ వంతెన పక్కన గల లాకులు వద్ద ఒక వ్యక్తి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అవిడి పెదపేటకు చెందిన నామాడి సుధాకర్ అలియాస్ బుజ్జి(40)గా గుర్తించారు. బుజ్జి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసుకలు ఫిర్యాదు చేశారు. కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### అయితపూడిలో భారీ చోరీ

ప్రజాశక్తి-కాజులూరు

మండలంలోని అయితపూడిలో ప్రముఖ వ్యాపారవేత్త కొల్లు వెంకటేశ్వరరావు ఇంట్లో భారీ చోరీ చోటు చేసుకుంది. సుమారు 140 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు వెంకటేశ్వరరావు కుటుంబం ఈ నెల 14న తిరుపతికి వెళ్లింది. తిరిగి మంగళవారం ఇంటికి చేరుకుంది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటాన్ని గుర్తించారు. ఆభరణాలను చోరీకి గురైనట్టు తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. అలాగే ఎఎస్పి దేవరాజ్ పాటిల్‌మనీష్ ఘటన ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట సిఐ కృష్ణచైతన్య సిబ్బంది ఉన్నారు.

### బైకు పైనుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

బైకు అదుపుతప్పడంతో కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మురారి గ్రామ శివారు జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు తెలిసిన వివరాల మేరకు గండేపల్లి గ్రామానికి చెందిన షేక్ నాగూర్(57) గైట్ కళాశాలలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా బుధవారం ఇంటి నుంచి బైకుపై గైట్ కళాశాలకు బయలుదేరాడు. మురారి గ్రామ శివారు వద్ద వర్షం కురవడంతో బైకు అదుపు తప్పింది. దీంతో అతను రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే ఆయన్ని రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు తరలించారు. అప్పటికే నాగూర్ చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

### శెట్టిబలిజ యువశక్తి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాజోలు

ఆపదలోవున్న పేదలకు ఆర్థికంగా సహాయం చేసి ఆదుకునే గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ సేవలు అభినందనీయమని మాజీ రాష్ట్ర ప్రభుత్వ నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ అన్నారు.గత కొంతకాలంగా కిడ్నీల సమస్యతో బాధపడుతున్న సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామానికి చెందిన రాచపల్లి దుర్గాప్రసాద్ కు గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ రూ.20 వేల సమకూర్చింది. రాజోలు ఎంపిపి కేతా శ్రీను, మాజీ నెడ్ కాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ చేతుల మీదుగా ఈ మొత్తాన్ని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గుబ్బల శ్రీనివాస్, దొంగ మహేష్, బైరిశెట్టి వెంకట రమణ ,పెద్దలు బి. పథ్వీ, తాడి సహదేవ్, చెల్లుబోయిన శ్రీనివాస్, గుర్రం నాగ వెంకట రాజు, అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి మినీ మహానాడు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మినీ మహానాడులో పాల్గొన్న టిడిపి నాయకులు

టిడిపి మినీ మహానాడును కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్ కటకంశెట్టి (బాబి) ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, కో ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి ) సర్పవరం జంక్షన్ స్పందన ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నురుకుర్తి వెంకటేశ్వరరావు కుడుపూడి చిట్టిబాబు, చిక్కాల దొరబాబు, వాసిరెడ్డి ఏసుదాసు, పెంకే శ్రీనివాస బాబా, వాసిరెడ్డి ఏసుదాసు, కుడిపూడి సత్తిబాబు, మాసుమేను గంగయ్య పాల్గొన్నారు.

**అధిష్టానం మమ్మల్ని పట్టించుకోవడం లేదు.**

కాకినాడ రూరల్ జనసేన ఎంఎల్ఎగా తవ కృషితో గెలుపొందిన తర్వాత అధిష్టానం తమను వాడుకుని టిడిపి నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు న్యాయమని టిడిపి మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి ప్రశ్నించారు. మహానాడులో ఆమె మాట్లాడారు. కూటమిలో అందరం కలిపి జనసేన ఎంఎల్ఎ గెలుపు కోసం శక్తి మేరకు కృషి చేశామన్నారు. కేవలం ఎన్నికల వరకే తమను ఉపయోగించుకుంటున్నారని, తరువాత తమకు ఎటువంటి ప్రాధాన్యతా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి కార్యకర్తలకు ఎవరికైనా ఆపద వస్తే ఎక్కడికెళ్లాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు.

# సత్యనారాయణ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -సామర్లకోట



రాజేష్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

సామర్లకోట నాలుగో వార్డ్ కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, ఏసుదాసు సోదరుల కుటుంబాలను వైసిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్మిక సంఘం నాయకుడు దవులూరి సుబ్బారావుతో పాటు పలువురు పరామర్శించారు. వారి కుమారుడు రాజేష్ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం కౌన్సిలర్ సత్యనారాయణ సోదరుడు ఏసుదాసు కుమారుడు పిట్టా రాజేష్ గడ్డి మందు తాగి మృత్యువాత పడ్డాడు. రాజేష్ స్మారక కార్యక్రమం బుధవారం స్థానిక బ్రౌన్ పేటలోని కౌన్సిలర్ సత్యనారాయణ ఇంటి వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకులు సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, వైసిపి అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ నాయకులు డాక్టర్ ప్రసన్న కుమార్, మండల పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ టి.బ్లెస్సింగ్ పాల్గొన్నారు.

### మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్ రెడ్డి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన కెవి.పద్మావతి సెంట్రల్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం (అమరావతి)కి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కాకినాడ నగరపాలక సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ రెడ్డి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ డిఇ డిఎస్.ప్రకాశరావు, టిపిఒ సిహెచ్.ఫణికుమార్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, సీనియర్ అసిస్టెంట్ అత్తిలి వీర్రాజు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది నూతన కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని కలిసి అభినందించారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం, ప్రజల సహాయ సహకారాలతో పారిశుద్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. త్వరలో ప్రారంభమై 37 రోజులపాటు జరిగే మరిడమ్మ అమ్మవారి జాతర సందర్భంగా పట్టణ పరిధిలో ప్రత్యేక కషి చేస్తానన్నారు.

### శ్యామ్ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

సముద్రంలో పడి గల్లంతైన మెరుగు శ్యామ్ కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని జనసేన నాయకుడు రావు అక్షయ్, వి.ధనబాబు తెలిపారు. బుధవారం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ ఆదేశాల మేరకు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు

### సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.55 కోట్లు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యదేవునికి హుండీల ద్వారా రూ.1,55,04,639 ఆదాయం లభించింది. బుధవారం కొండపైన ఇఒ వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవి.రోహిత్ సమక్షంలో అధికారులు 26 రోజుల్లో హుండీల్లో వేసిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో 48 గ్రాముల బంగారం, 730 గ్రాముల వెండి వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభించింది.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న జర్నలిస్టులు

### అసత్య వార్తలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ ముమ్మిడి లక్ష్మణ్‌పై అసత్య వార్తలు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీనియర్ జర్నలిస్టులు బుధవారం ధర్నా చేపట్టారు. దుర్రాని, వాతాడ నవీన్ రాజ్, శివ నారాయణ రెడ్డి, కృష్ణంరాజు, సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్ ఆధ్వర్యాన జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను వినతిపత్రం అందించారు. పిఠాపురంలోని ఎఫ్‌కె.పాలెంలో మట్టి అక్రమ తవ్వకాలప లక్ష్మణ్ కథనాలు రాయడం వల్ల మట్టి మాఫియాకు సంబంధించిన వారు సోషల్ మీడియాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన జెసి రాహుల్ మీనా నిందితులపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీధి గోపీనాథ్, మంగ వెంకట శివరామకృష్ణ, చైతన్య కృష్ణ, మేకల వెంకటరమణ, చిస్టీ, పుర్రె త్రినాథ్, రాజు, దొరబాబు, వెంకట రమణ, మాధన్, ముమ్మిడి లక్ష్మణ్, దుళ్ళ శ్రీధర్, గణపతి, శ్రీధర్, రాజ్ కమల్, సత్య, రెడ్డి, వినయ్, శ్రీను, అడప సతీష్, ఫరక్, శ్రీహరి పాల్గొన్నారు.

### పట్టాభి కుటుంబానికి చందన పరామర్శ

ప్రజాశక్తి - కడియం

పితృవియోగంతో బాధ పడుతున్న వైసిపి నాయకుడు శాకా పట్టాభి కుటుంబాన్ని రాష్ట్ర పచ్చదనం మరియు సుందరీకరణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చందన నాగేశ్వరావు పరామర్శించారు. బుధవారం కడియంలోని పట్టాభి స్వగృహం చేరుకున్న చందన శాకా సుబ్బారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాకా కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### జిఒ 4పై పునరాలోచన చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబర్ 4పై పునరాలోచన చేయాలని విఆర్‌ఒల సంఘం నాయకులు కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్‌కు సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఒ సంఘ నాయకులు మాట్లాడుతూ ఒక సచివాలయానికి ఒకే విఆర్‌ఒ ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 2019కి ముందున్న రెవెన్యూ క్లస్టర్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఒక రెవెన్యూ విలేజ్‌కి ఒక విఆర్‌ఒ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విఆర్‌ఒలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

### రేషన్ దుకాణం పరిశీలన

ప్రజాశక్తి - ఐ.పోలవరం

జి.మూలపొలం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న యర్రగరువు గ్రామంలో రేషన్ షాప్ ను వైసిసి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ షాప్ నిర్వహిస్తున్న జగడం సత్తిబాబును బుధవారం వైసిపి జిల్లా జనరల్ సెక్రటరీ రేవు అప్పారావు ఆధ్వర్యంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ కాశి షర్మిల, 5వ వార్డు పంచాయతీ మెంబర్ రేవు మంగాదేవి సమక్షంలో రేషన్ డీలను ప్రశ్నించారు. రేషన్ సరుకులు ఇచ్చే విధానం గురించి డీలర్ సత్తిబాబును అడిగి తెలుసుకున్నారు. సత్తిబాబు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ ఇస్తామన్నార. మిగతా రోజులలో బయోమెట్రిక్ మిషన్ పనిచేయదని అన్నారు. రేవు అప్పారావు మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి, వృద్ధులు, వికలాంగులకు, అనారోగ్యం ఉన్న వారికి రేషన్ సరుకులు ఇంటకి సరఫరా చేయాలన్నారు. రేషన్ పంపిణీ డోర్ డెలివరీ చేస్తున్న వాహనాలను జూన్ 1వ తేదీ నుంచి నిలుపుదల చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రకటించారన్నారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఉన్న ఫలంగా రేషన్ వెహికల్ రద్దు చేయడం సమంజసం కాదని ఆయన అన్నారు.

### యోగాపై గ్రామ స్థాయిలో అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

నేటి నుండి జూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు యోగా సాధనపై గ్రామ స్థాయి వరకూ వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యోగ ఓరియంటేషన్ కార్యక్రమంలో ఎస్పి బిందు మాధవ్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పార్టీ పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసులు, డిఆర్‌ఒ జె.వెంకట్రావు, జిల్లా పరిషత్ సిఇఒ లక్ష్మణరావు, జిల్లా క్రీడా అభివద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్, వివిధ యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర జిల్లా అధికారులతో కలిసి యోగాసనాలు సాధన చేశారు.

### 23న మినీ మహానాడును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కోరుకొండ

ఈ నెల 23న జరిగే రాజమహేంద్రవరం పార్లమెంటు స్థాయి మినీ మహా నాడును జయ ప్రదం చేయాలని ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు పిలుపు నిచ్చారు. రాజానగరం నియోజకవర్గ మినీ మహానాడు మండలంలోని బూరుగుపూడి గేటు వద్ద ఉన్న టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టిడిపి జెండా మోసిన పార్టీ శ్రేణులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. పార్టీకి సేవలు అందించిన ప్రతీ కార్యకర్తకు గౌరవం దక్కుతుందని, ఓర్పు వహించాలని కూటమిలో ఉన్న బిజెపి, జనసేనతో సర్దుకుపోవాలని ఆయన సూచిం చారు. రుడా ఛైర్మన్, నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం, పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకంలో రైతులకు నష్టపరిహారం, ఈనాం భూములు, 22ఏ లో చేర్చిన భూముల సమస్య పరిష్కారం కోసం తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కంటే కేశవరావు, అడపా వీరబాబు, నూనె వెంకన్న పాల్గొన్నారు.

### పలు గ్రామాల్లో గిరిబాబు పర్యటన

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలంలో శరభవరం, రౌతుపాలెం, పెదశంకర్లపూడి, ప్రత్తిపాడు గ్రామాల్లో వైసిపి ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. శరభవరం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి అమరాధి నాగభూషణంను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రౌతుపాలెంలో వైసిపి నాయకుడు నేదుళ్ల శ్రీనుని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెదశంకర్లపూడిలో మాజీ ఎంపిటిసి కోట పద్దరాజును పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని అన్నారు. ప్రత్తిపాడులో డాక్టర్ అందె చిట్టికొండను పరామర్శించి యోగక్షేమాలు అడిగు తెలుసుకున్నారు. గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామిశెట్టి నాని, గారా రమణ, రామిశెట్టి దొరబాబు, గువేరా, దలే చిట్టిబాబు, గుడాల వెంకటరత్నం, అమరాధికాశి, రంగనాథం అబ్బాయి, గొల్లపల్లి దొరబాబు పాల్గొన్నారు.

### పంట స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మల్లిశాల శివారున ఉన్న అడ్డుకొండ భూమిలోని మామిడి పంటను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గండేపల్లి మండలం కె.గోపాలపురం, జగ్గంపేట మండలంలోని మల్లిశాల మధ్య 500 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిలో కొన్ని ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఐతే ఆ పక్కనే 75 ఎకరాల భూమి ఉన్న ఏలేటి వర్గీయులు తోటలోని మామిడి కాయలను బుధవారం కోయడంతో ఎపి రైతు కూలీ సంఘం నాయకులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ జెవిఆర్.రమేష్, పోలీసులతో కలిసి పంటను స్వాధీనం చేసుకుని పాట ద్వారా వాటిని విక్రయించారు.

### గణితంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులకు గణితంలో మెలకువలపై అవగాహన కల్పించారు. కాండ్రకోట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టి.మురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితం సులువుగా నేర్చుకునే విధంగా అనేక ప్రక్రియలపై అవగాహన కల్పించారు. గణితం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలిగేలా ఆయన శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు విద్యార్థులకు దేశభక్తి గీతాలు, నీతి పద్యాలు ఆలాపనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బుల్లయ్య, గ్రంథాలయ పాఠకులు బి.అరవింద్, ఎల్.రాజు, ఎం.రామారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### రహదారి భద్రత - మన జీవన భద్రత

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో డ్రైవర్లకు భద్రతా నియమాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదిత్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్. కె.శ్రీధర్ పాల్గొనగా, గౌరవ అతిథులుగా కాకినాడ జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బివి.మురళీకృష్ణ, జిల్లా రహదారి భద్రతా విభాగం వైద్యాధికారి డాక్టర్ ఎవి.పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య డ్రైవర్ల సంక్షేమం కోసం వారి ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ట్రాన్స్పోర్ట్ విభాగం నుండి పి.కృష్ణమూర్తి, పి.విజయ్ కుమార్ రెడ్డి, ఎం.సూర్యనారాయణ, ట్రాన్స్‌పోర్ట్ స్టాఫ్ మరియు బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

### నేటి నుంచి యోగాపై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

జూన్ 21 యోగా దినోత్సవం సందర్భంగా పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి యోగా శిక్షణ ప్రారంభమవుతుందని ఎంపిడిఒ డి.శ్రీలలిత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జూన్ 21వ తేదీ వరకు యోగా మాసంగా పాటిస్తూ యోగాపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో యోగాలో మూడు రోజులపాటు శిక్షణ ఇస్తారన్నారు.

### ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో సొంతిల్లు లేని వారు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు కలిగిన వారు, గతంలో ఇంటి స్థలాలు పొందని వారు ఇళ్ల స్థలాలు పొందేందుకు అర్హులన్నారు. అర్హులైన వారు వెంటనే వారి పరిధిలోని సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాల మంజూరు చేస్తారన్నారు.

### ఆరోగ్య కేంద్రం భవనానికి లీకులు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం కురిసిన వర్షానికి స్లాబు, గోడలు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో గోడలు నీళ్ల కారుతున్నాయి. ఇటీవల ఎంఎల్‌సి నాగేంద్రబాబు దీన్ని ప్రారంభించారు. ప్రారంభించిన కొన్ని రోజులకే చిన్న పాటివర్షానికే బిల్డింగ్‌లో నీరు కారడం మొదలైంది. నిర్మాణం నాసిరకంగా చేపట్టడంపై అధికారులు చూచి చూడనట్టుగా వ్యవహరించడం వల్లనే ఈ విధంగా ఉందని ప్రజలు చెబుతున్నారు దీనిపై అధికారులు స్పందించి నాసిరకం నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆందోళన నిర్వహిస్తున్న ఈశ్వరరావు తదితరులు

### 'ఉపాధి'లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. ఉపాధి హామీ పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మేట్స్‌కు పారితోషికం ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కేంద్రంలో ఉపాధి హామీకి రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.అదృష్టదీపుడు, జి.భాస్కరరావు, డి.వాసుదేవ, కె.అనంతలక్ష్మి, టి.ఆదిలక్ష్మి, జి.వెంకటరమణ, ఎస్. సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, MOHAMMAD SOFIYA KHAN, W/o Mohammad Azeem Khan and Residing at D.No.7-13-5, Pentu Saheb Street, Nidadavole, E.G.Dist., I have Changed my name from **SHAIK SOFIYA (OLD NAME)** to **MOHAMMAD SOFIYA KHAN (NEW NAME).** Henceforth I am being called as **MOHAMMAD SOFIYA KHAN** for all purposes.

**పాస్‌పోర్ట్ పడిపోయినది**

మాకే కుమారి, భర్త: మత్స విష్ణువు, టి చల్లపల్లి, పరపేట వాసిని. ది 17-05-2025న నేను నా **పాస్‌పోర్ట్ నెం. పి 6293291** గల పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ నిమిత్తం ఇంటి నుండి ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్ సెంటర్‌కు వచ్చి చూసుకొనగా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయినది. వెంటనే పాస్‌పోర్ట్ కోసం వెతకగా దొరకలేదు. నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను. అందజేసిన వారికి తగు పారితోషికం ఇవ్వబడును.

**మాకే కుమారి,** భర్త: మత్స విష్ణువు,
డోర్ నెం.3-8, పర పేట,
టి చల్లపల్లి, ఉప్పలగుప్తం మండలం,
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ నెం.81436 80616

**ప్రకటన**

కీ॥శే॥ కేశనకుర్తి రాజేష్ (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, ఏ.వేమవరం గ్రామ కాపురస్తులు కేశనకుర్తి లక్ష్మణరావు, S/o. వెంకటేశ్వరరావు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా సోదరుడు **కేశనకుర్తి రాజేష్,** S/o. వెంకటేశ్వరరావు, ఏ.వేమవరం గ్రామంలో మా ఇంటి వద్ద 24-10-2023 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఏ.వేమవరం గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **కేశనకుర్తి లక్ష్మణరావు**
S/o. వెంకటేశ్వరరావు, ఏ.వేమవరం,
అమలాపురం మండలం
సెల్: 9032466452

**బహిరంగ పత్రికా ప్రకటన**

మా క్లయింట్ అనగా **Smt. Y.S.V.Satyaveni,** W/o. BPT A Prasad, R/o. D.No. 3-44, Chollangi Village Tallarevu Mandal, East Godavari District అనువారు మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయునది ఏమనగా:

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని మా క్లయింట్ 02-11-2005 సంవత్సరం తేదీన **అయినాల వెంకట రమణ** అనువారి వద్ద రిజిస్టర్ క్రయ దస్తావేజు రీత్యా క్రయం పొంది స్వాధీనం పొంది యున్నారు. సదరు ఆస్తిని **అయినాల వెంకట రమణ అనువారు భేరి నాగేశ్వరరావు** గారి వద్ద నుండి రిజిస్టర్ దస్తావేజు రీత్యా క్రయం పొందియున్నారు. సదరు **భేరి నాగేశ్వరరావు అనువారు రిజిస్టర్ క్రయ దస్తావేజు రీత్యా శ్రీమతి కలగర సూర్యకాంతం** గారి వద్ద క్రయం పొంది యున్నారు.

మా క్లయింట్ ను నష్ట పరచాలనే ఉద్దేశ్యంతో మరియు ఆస్తిని కాజేయలనే ఉద్దేశ్యంతో భేరి నాగేశ్వరరావు మరియు బోనం వెంకట నరసింహారావు అనువారలు లాలూచి పడి యీ దిగువ షెడ్యూల్ ఆస్తికి అక్రమ దస్తావేజులు తయారు చేసి, బోనం వెంకట నరసింహారావు అనువారు సదరు అక్రమ దస్తావేజుతో ఆస్తిపై తన హక్కు నిర్ధారించమని మరియు నా దస్తావేజును రద్దు చేయమని మహారాజశ్రీ కొవ్వూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు O.S. No. 271/2005 నంబరున దావా దాఖలు చేయగా సదరు దావాను శ్రీ కోర్టు వారు విచారణ జరిపి ది.27-09-2016 న సదరు దావాను డిస్మిస్ చేస్తో నా దస్తావేజు చెల్లుతుందని తీర్పు యిచ్చినారు. అందుపై బోనం వెంకట నరసింహారావు మహారాజశ్రీ కొవ్వూరు తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు అప్పీలు A.S.No. 90/2016 నంబరున దాఖలు చేయగా సదరు అప్పీలు విచారించి శ్రీ కోర్టు వారు ది. 26-12-2024 నాడు క్రింది కోర్టు వారి తీర్పుని కాయపారుస్తూ అప్పీలు కొట్టివేసినారు. క్రింది కోర్టు వారి ఖర్చులు మరియు అప్పీలు కోర్టు వారి ఖర్చులు నాకు చెలయించమని తీర్పు చెప్పి యున్నారు. అదే విధంగా బోనం వెంకట నరసింహారావు మరియు చెలంకూరి భావన్నారాయన కలసి లాలూచి పడి నాపై దాఖలు చేసిన A.T.C.No. 31/2005 ను కూడా ది. 30-09-2009 న డిస్మిస్ చేసియున్నారు.

బోనం వెంకట నరసింహారావు అనువారు పై జరిగిన విషయములు, మరియు కోర్టు తీర్పులు మరుగు పరచి ఈ దిగువ షెడ్యూల్ దాఖల భూమిని అక్రమ లభ్యం పొందే ఉద్దేశ్యముతో తప్పుడు దస్తావేజులు సృష్టించుటకు మరియు ప్రజలను మోసగించుటకు ప్రయత్నం చేస్తున్నట్టు నా క్లయింట్ నకు తెలియ వచ్చినది. కనుక యావన్మంది ప్రజలుకు తెలియ చేయునది ఏమనగా యీ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తి నా క్లయింట్ యొక్క స్వాధీన హక్కు భుక్తములలో ఉన్నదని మరియు అందుపై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరిపినను అవి నా క్లయింట్‌ను ఏవిధంగానూ Bind చేయవని మరియు యీ దిగువ షెడ్యూల్ ఆస్తి విషయమై నిజాలు ప్రజలకు తెలియ చేయాలనే ఉద్దేశ్యంతో మరియు ప్రజలు నష్టపోకూడదని యీ ప్రకటన జారీ చేయడమయినది.

**PROPERTY SCHEDULE**

West Godavari District (Now East Godavari District), Kovvur Mandal, Kovvur Sub-Registry, in Dommeru Grama Panchayathi Board, Dommeru Village, 4th ward, near Door No.4-25, Zeroyathi Dry R.S.No.508 full extent of Ac.6.44 cents in it southern side Ac..095 cents equivalent to 4598 square yards vacant site bounded on:-

**EAST:** Land of Kalagara Radha Krishna Prasad, **SOUTH:** Land of Kalagara Hanumantha Rao. **WEST:** Land of Pendyala Narendranadh Chowdary. **NORTH:** Remaining land of Bonam Venkata Narasimha Rao in the same survey number.

*Within the above said boundaries an extent of 4,598 square yards of vacant residential site with all its easementary and necessity rights.*

**IV RAMANA MURTHY,**
**PVS S SARMA,**
Kovvur
21-05-2025
Advocates, Kovvur-534 350.